చెత్త పన్ను పెంపునకు

డ్వాక్రా గ్రూపుల్లో తీర్మానాలా..?

◆ తక్షణం ఉపసంహరించుకోవాలి

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలపై చెత్త పన్ను భారాలు వేసేలా అధికారులు డ్వాక్రా గ్రూపుల్లో తీర్మానాలు చేయడం దుర్మార్గమని, తక్షణం ప్రభుత్వం దీనిని ఉప సంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో డ్వాక్రా గ్రూపు మహిళలతో చెత్త పన్నులు వసూలు చేస్తామని తీర్మాణాలు చేయడాన్ని ఆ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ నగర పాలక మండలి మొత్తం అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్‌లు ఉన్నప్పటికీ అక్కడ ఏ మాత్రం చర్చించకుండా డ్వాక్రా గ్రూపుల్లో తీర్మానాలు చేయించడం ప్రజల వేలితో ప్రజల కళ్లు పొడిచేందుకే అన్నట్లు ఉందన్నారు. చెత్త పన్ను నిర్ణయించే అధికారం డ్వాక్రా గ్రూపులకు ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆస్తి పన్ను భారీగా పెంచిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో చెత్త పన్ను పెంచాలని నిర్ణయించిందన్నారు. గుంతకల్లులో నెలకు ప్రతి ఇంటి నుంచి రూ.60లు చెత్త పన్ను వసూళ్లు చేయడానికి వ్యతిరేకంగా సిపిఎం అనేక రూపాల్లో ఆందోళన చేసిందని గుర్తు చేశారు. చివరకు కౌన్సిల్‌లో చర్చించి వాయిదా వేసి, పన్ను వసూళ్లు చేసే బాధ్యత మున్సిపల్ సిబ్బంది చేయకుండా డ్వాక్రా గ్రూపు మహిళలపై పెట్టే ప్రయత్నం చేశారన్నారు. అనంతపురం నగర పరిధిలోని డ్వాక్రా గ్రూపు సమావేశాలు 14వ తేదీన అత్యవసరంగా జరిపి నెలకు రూ.30 నుంచి రూ.60 చెల్లించడానికి తీర్మానాలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ నెల చివరిలో నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో తీర్మానాల ఆధారంగా చెత్తపన్ను పెంచి ప్రజలు కోరినందున పన్నులు పెంచామని చెప్పకోవడానికి ఈ రకమైన తప్పుడు పద్ధతిని మున్సిపల్ అధికారులు వ్యవరిస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం చివరిలోపు అన్ని మున్సిపాల్టీలు, నగర పాలక సంస్థల్లో చెత్తపన్ను వసూళ్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలపై భారాలు వేసే చెత్త పన్ను నిర్ణయాన్ని ఉప సంహరించాలని, డ్వాక్రా గ్రూపుల ద్వారా తీర్మానాలు చేయడాన్ని నగర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే డ్వాక్రా గ్రూపు మహిళలు అధికార పార్టీ సభ్యులకు, ప్రభుత్వ కార్యక్రమాలకు బలవంతంగా తరలించే పద్ధతి గత నుంచి కొనసాగుతోందన్నారు. ఈ ప్రభుత్వం ఇంకో అడుగు ముందుకు వేసి ప్రజలపై వేసే భారాలకు కూడా డ్వాక్రా గ్రూపులను ఉపయోగించుకోవడం అప్రజాస్వామికమని విమర్శించారు.

చెత్త పన్నులు పెంపుల సరికాదు : యునైటెడ్ సిటిజన్స్ ఫోరమ్

రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్నులు పెంపుదల చేసి వసూలు చేసే బాధ్యతను డాక్రా గ్రూపు మహిళలకు బలవంతంగా అప్పగించడం సరికాదని, ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని యునైటెడ్ సిటిజన్స్ ఫోరమ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.అబ్దుల్ రసూల్, ఎజి.రాజమోహన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో డ్వాక్రా గ్రూపులతో బలవంతంగా పన్నులు వసూలు చేయాలని తీర్మానించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం బలవంతం మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక రకాల పన్నులు విధిస్తూ, సుంకాలను కూడా పెంచుతోందన్నారు. వాటిలో డస్ట్‌బిన్ సేకరణపై వినియోగదారు ఛార్జీలు అందరికీ తెలిసినట్లుగానే దీనిపై సర్వత్రా వ్యతిరేకత, అసంతృప్తి నెలకొందన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని వారికి అవసరమైన ఉపశమనం కల్పించే బదులు ప్రభుత్వం ఇలాంటి సుంకాలు, పన్నులు వేయడం సరికాదన్నారు. డస్ట్‌బిన్ సేకరణపై వినియోగదారు రుసుం చెల్లించడానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తూ తీర్మానాన్ని ఆమోదించడానికి డ్వాక్రా గ్రూపులను ఒత్తిడి చేయడం అప్రజాస్వామికం అన్నారు. దీన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరారు.

రైతు కష్టం.. వర్షార్పణం..!

◆ అధిక వర్షాలతో అపార నష్టం

◆ పంటలపై తీవ్ర ప్రభావం

◆ తెగుళ్లతోనూ తగ్గిన దిగుబడులు

◆ నష్టాల ఊబిలో అన్నదాతలు

నిత్యం కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది అధిక వర్షాలు ముంచేస్తున్నాయి. ఎప్పడూ వర్షం కోసం అకాశం వైపు ఎదురు చూసే వారు. ఈసారి మాత్రం సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు పడుతూనే ఉన్నాయి. వర్షాలు పడుతున్నాయన్న ఆనందం అన్నదాతల కళ్లలో కన్పించడం లేదు. ఎడతెరిపిలేకుండా పడుతున్న వర్షాలు పంటలను నాశనం చేస్తూ రైతులకు నష్టాలను మిగులుస్తున్నాయి. పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావన్ని చూపుతున్నాయి. చేతకొచ్చిన పంటలు వర్షం దెబ్బకు నేలవాలుతున్నాయి. గత వారం రోజులుగా తుపాన్ దెబ్బకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పంటలు దెబ్బతిని రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి.

బొమ్మనహాల్ మండలం దేవగిరి మండలంలో నేలకొరిగిన చెరుకు పంట

మాండూస్ తుపాను దెబ్బకు బొమ్మనహాల్ మండలం కొలగనహల్లి గ్రామంలో నేలకొరిగిన వరిపంట

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంతో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు బాగానే కురిశాయి. సాధారణంగా అక్టోబర్ వరకే జిల్లాలో వర్షాలు పడేవి. ఆ తరువాత వర్షం పెద్దగా పడేది కాదు. మాండూస్ ప్రభావంతో డిసెంబరులోనూ వర్షాలు పడ్డాయి. గత నాలుగు రోజులుగా దాదాపు అన్ని మండలాల్లో జడివాన పట్టుకున్ని చినుకులు పడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ పంటలు నూర్పిడి జరుగుతున్న సమయంలో వస్తున్న వర్షాలతో రైతుకు అపార నష్టాన్నే కలిగిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 16 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 10 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవగా, తక్కిన ఇతర పంటలు సాగయ్యాయి. వేరుశనగ ఇప్పటికే నూర్పిడి పూర్తయ్యింది. ఇప్పుడు పడుతున్న వర్షాలు వరి, పత్తి, మిరప, కంది పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరి పంట కోత దశకు వచ్చింది. 62 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. అది ఇప్పుడు నూర్పిడులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఎడతెరిపిలేకుండా పడుతున్న వర్షాలతో పొలంలోనే మొలకెత్తే పరిస్థితి నెలకొంది. కందిపంట 2.39 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇది కూడా కాపు దశకు వచ్చింది. వరుసగా పడుతున్న వర్షాలతో కందిపంట చెట్టుపైనే మొలకెత్తుతోంది. కంది కాయలు నల్లగా మారుతున్నాయి. పత్తి ఇప్పటికే పూర్తిగా దెబ్బతింది. రెండు లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. గతంలో ఎన్నడూలేనంతగా ఈ పంటలు సాగయ్యాయి. అక్టోబరు నుంచి పడుతున్న వర్షాలతో దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. దీని వల్ల నష్టం జరిగిందని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం గుర్తించారు. ప్రభుత్వానికి నివేదికలూ అందజేశారు. 70 వేల ఎకరాల్లో మిరప పంట సాగైంది. దీనికి నల్లి తెగుళ్ల పట్టి పడిస్తోంది. ఈ రకంగానూ రైతుకు నష్టం వాటిల్లింది.

మాండూస్‌తో వెయ్యి ఎకరాల్లో పంటనష్టం

మాండూస్ తుపాన్‌తో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. ఇందులో అధికంగా వరి పంటే ఉంది. ఎనిమిది మండలాల్లో ఎక్కువగా పంటనష్టం జరిగినట్టు గుర్తించారు. ఏడు మండలాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. 25 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు అంచనా వేశారు. ఇవి ప్రాథమిక అంచనాలు. ఇంకా పూర్తి స్థాయి అంచనాల్లో ఏ మేరకు నష్టం వస్తుందో చూడాల్సి ఉంది. ఇవి వర్షాలతో దెబ్బతిన్న పంటలు మాత్రమే. తెగుళ్ల అధికమై దిగుబడులు నష్టం జరిగిన అంచనాలు ఇందులో ఉండవు. వీటిని లెక్కగడితే పంటనష్టం ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది.

42 శాతం అధికం

రెండు జిల్లాల పరిధిలో 42 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. అనంతపురం జిల్లా పరిధిలో సాధారణ వర్షపాతం 455 మిల్లీమీటర్లు అయితే 647 మిల్లీమీటర్లు నమోదయ్యింది. సాధారణం కంటే 42 శాతం అధికంగా పడింది. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో 525.8 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికిగానూ 787.6 మిల్లీమీటర్లు నమోదయ్యింది. రెండు జిల్లాల పరిధిలోనూ ఈ ఏడాది వర్షాపాతం సాధారణంగా ఎక్కువగా నమోదయ్యింది. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో ఒక్క డిసెంబరు మాసంలో సాధారణ వర్షపాతం 6.7 మిల్లీమీటర్లు అయితే 32.4 మిల్లీమీటర్లు నమోదయింది. అంటే సాధారణం కంటే 383.4 శాతం అధికంగా నమోదవడం గమనార్హం.

అనంతపురం మన్నీల గ్రామంలో వర్షం దెబ్బకు నల్లగామారి మొలకలు వచ్చిన కందికాయలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న విసి రంగజనార్ధన

క్లాప్‌పై ప్రజల్లో అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని వివిధ డివిజన్లో పారిశుధ్యంపై బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. చెత్తను వేరు చేయడానికి నగరపాలక సంస్థ ఇదివరకే ప్రతి ఇంటికి సరఫరా చేసిన మూడు రకాల డస్ట్ బిన్ల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరుచేసే విధానాలను ఉపయోగించే తీరు, హోమ్ కంపోస్ట్, యూజర్ ఛార్జీలపై కమిషనర్ భాగ్యలక్ష్మి మహిళలకు తెలియజేశారు, అందించిన మూడు రకాల డస్ట్ బిన్ల ద్వారానే చెత్త ఇవ్వాలని సూచించారు. ప్రతి మహిళ, నగర పౌరులు ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లే నగర పరిశుభ్రత పట్ల కూడా తమవంతు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, గుత్తి రోడ్డు తదితర ప్రాంతాలలో రోడ్లపై చెత్తను తొలగించేలా కమిషనర్ చర్యలు తీసుకున్నారు. ఆలమూరు లేఅవుట్ నందు ఇళ్ల నిర్మాణ పనులు, పురోగతిపై కాంట్రాక్టర్, ఆమెనిటీస్ కార్యదర్శులతో చర్చించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సావిత్రి, నగరపాలక కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జూడో పోటీల్లో సత్తా చాటాలి

ఎవిఆర్ పాఠశాల ప్రిన్సిపల్ విక్రమ్‌బాబు

ప్రజాశక్తి-ఉరవకొండ

జూడో పోటీలలో జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఉరవకొండ ఎవిఆర్ పాఠశాల ప్రిన్సిపల్ విక్రమ్ బాబు, కోచ్ సాకే పురుషోత్తం పేర్కొన్నారు. ఈనెల 11, 12, 13 తేదీలలో అనంతపురం ఆర్‌డిటి స్టేడియంలో జరిగిన సెంట్రల్ జోన్ జూడో పోటీలలో ఉరవకొండ ఎవిఆర్ పాఠశాల క్రీడాకారులు సత్తా చాటారు. ప్రణయ్ 90 కేజీల విభాగంలో, లోకేష్ 60 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్స్, మహిధర్ 25 కేజీల విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించారన్నారు. పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు. స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, ఉన్నత లక్ష్యాలు సాధించేలా క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం

బెలుగుప్ప : గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, ఎంపిటిసిలు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న సూచించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ పెద్దన్న మాట్లాడుతూ జగనన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఆర్‌బికె, సచివాలయాలు, హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు, సిసి రోడ్లు త్వరగా పూర్తి అయ్యేందుకు సర్పంచులు, అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదవేంద్ర ఎంఇఒ మల్లారెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, జెడ్పిటిసి భర్త త్రిలోక్‌నాథ్‌రెడ్డి, ఏవో పృథ్వీసాగర్, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, సర్పంచులు సాలిబాయి భర్త గంగ్యా నాయక్, రామ్‌రెడ్డి, పురుషోత్తం, మారుతి రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు

పేదలకు అన్నం పెట్టడమే లక్ష్యం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి

అన్నదాన సేవ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమే తమ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఆర్డీటీ ఆసుపత్రి వద్ద చేపట్టిన ఎన్టీఆర్ అన్న క్యాంటిన్ ఉచిత అన్నదాన సేవ 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, యువనేత మారుతీ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు వైపి రమేష్, ఆర్జీ శివశంకర్, నరసాపురం మురళి, మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు, పట్టణ అధ్యక్షులు శర్మాస్‌వలి, మాజీ కన్వీనర్ డీకే రామాంజినేయులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఊటంకి రామాంజినేయులు, యర్రంపల్లి సత్తి ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేద రోగులు, వారి సహాయకుల ఆకలి తీర్చాలన్న ఆశయంతో ఎన్టీఆర్ స్ఫూర్తితో ఉన్నం హనుమంతరాయచౌదరి ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నేటికి 200 రోజులుగా నిరంతరాయంగా పేదల ఆకలి తీరుస్తున్నామన్నారు. ఇదే ఒరవబడిని మునుముందు కొనసాగిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే కళ్యాణదుర్గం ప్రాంతంలో రెండు చోట్ల అన్నా క్యాంటిన్‌లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఒక్కోచోట రోజు 300 మంది నుంచి 500 మంది వరకు ఉచిత భోజనం అందిస్తునట్లు తెలిపారు. టీడీపీ అధి నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 80 వేల మందికి పైగా ఉచిత భోజనం అందించామన్నారు. అన్నా క్యాంటిన్ నిర్వహణకు సహకరించిన టీడీపీ నాయకులు, అన్ని విభాగాల శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మాండౌస్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యంతో సహా మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కడవకల్లు గ్రామంలోని రైతు సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విటి.రామాంజినేయులు, మండల కార్యదర్శి గుత్తా వెంకట చౌదరి మాట్లాడుతూ.. తుపాను కారణంగా మండలంలోని అనేక గ్రామాల్లో పత్తి, పప్పుశెనగ, కంది, మొక్కజొన్న, పండ్లతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. కల్తీ విత్తనాలతో ఇప్పటికే పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని గోరు చుట్టు మీద రోకటి పోటులా మాండౌస్ తుఫాన్ దెబ్బతీసిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగభూషణం, టి.నాగమునేంద్ర, బి.రామాంజనేయ చౌదరి, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

గ్రూపు అభ్యసనతో విజ్ఞానం

జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

ఒంటరిగా కాకుండా గ్రూపు అభ్యసన చేయడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన పేర్కొన్నారు. బుధవారం నాడు అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థుల పరిచయ కార్యాక్రమాన్ని ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసితో పాటు అనంతపురం దిశ డీఎస్పీ ఎ.శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య ఎంతో కీలకం అయినదన్నారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాల మీద పరిశోధనలు చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒంటరిగా చదుకోవడం కంటే గ్రూపులుగా కలసి చదుకోవడం వల్ల కొత్త విషయాలు ఎక్కువ తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటిని సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు మంచి, చెడులను గుర్తించి సరైన మార్గంలో ముందుకు నడవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ పరీక్షల విభాగం ఆచార్యులు ఇ.కేశవ రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, ప్రోగ్రాం సూపరింటెండెంట్ కోఆర్డినేటర్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి జోజిరెడ్డి విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఒటిపిఆర్ఐ ప్రాంగణ నియామకాల్లో 22 మంది ఎంపిక

అనంతపురం జెఎన్‌టియు అనుబంధ ఓటీపీఆర్ఐ కళాశాలలో బుధవారం నాడు ఉద్యోగ ప్రాంగణ నియామకాలను నిర్వహించారు. ఇందులో 22 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థులను డైరెక్టర్, ప్రిన్సిపాల్ గోపినాథ్ అభినందించారు.

మైనార్టీలపై బిజెపి మొసలికన్నీరు

కాంగ్రెస్ మైనార్టీ విభాగం నాయకులు దాదా గాంధీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మైనార్టీలపై మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మభ్యపెడుతోందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ అన్నారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమాభివృద్ధి కోసం అమలుచేస్తున్న అబుల్ కలాం ఆజాద్ స్కాలర్‌షిప్‌ను రద్దుచేయడం దుర్మార్గంగా ఉందన్నారు. బిజెపికి పేరు రావాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం మంత్రి స్మృతి ఇరానీ పేరో, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు సావర్కర్ వంటి వారు పేర్లు పెట్టుకోనైనా మైనార్టీలకు స్కాలర్‌షిప్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అక్షరాస్యతను పెంచేందుకు వేలకోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న ప్రభుత్వాలు విద్యారంగం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా మైనార్టీ వర్గాలు ఇప్పటికే చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. చిన్న చిన్న దుకాణాలు, ఆటో గ్యారేజీల్లో లక్షల మంది కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పుడిప్పుడే మైనార్టీ వర్గాలు చదువుకు దగ్గరవుతున్న పరిస్థితుల్లో వారిని ఆర్థికంగా ఇబ్బంది పెట్టి మరింత దూరం చేసే ప్రయత్నం జరుగుతుందని, దీన్ని మైనార్టీలు ఖండిస్తున్నారని తెలిపారు. తక్షణమే అబ్దుల్ కలాం స్కాలర్ షిప్‌ను కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విరాలం అందజేస్తున్న నాగరాజు

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి పట్టణంలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న వినాయకుని ఆలయానికి ప్రముఖ కాంట్రాక్టర్, శ్రీసాయిబాబా కన్‌స్ట్రక్షన్స్ ప్రొప్రైటర్ కె.నాగరాజు రాయల్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. బుధవారం ఆయన ఆలయానికి వెళ్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు నాగరాజు రాయల్‌ను సన్మానించారు. శాలువా, పూలమాలతో సత్కరించారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ఆత్మకూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి హేమలత అధ్యక్షతన, ఎంపీడీవో కొండన్న ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికపై బుధవారం రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్పంచి వరలక్ష్మి, పంపనూరు సర్పంచి ఎర్రిస్వామి, మదిగుబ్బ సర్పంచి నరసింహులు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాయదుర్గమ్మ రూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో కొండయ్య ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై బుధవారం రెండవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, విలేజ్ సర్వేయర్స్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

గార్లదిన్నె : గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్, ఇన్‌ఛార్జి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మనోజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో హైరిస్క్ గర్భిణులకు అందిస్తున్న సేవలపై, ఎంసిపి కార్డులు, వ్యాధినిరోధక టీకాలు అదితర సేవలు అందజేస్తున్న తీరుపై ఆరాతీశారు. కుష్టు వ్యాధి సర్వేలో భాగంగా సస్పెక్టెడ్ కేసులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని, మండల వైద్యాధికారి చేత వ్యాధిని ధ్రువపరుచుకుని మందులు అందజేయాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గౌతమి, పిహెచ్ఎన్ నాగమ్మ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆశాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలలో జరిగిన పంచాయతీరాజ్, పశుసంవర్ధక, అటవీశాఖల్లో ఉపాధి హామీ నిధులతో జరిగిన పనులను తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఆర్‌పి తులసీనాయక్ నాయకత్వంలో సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాలలో నిర్దేశించిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి

పుట్లూరు : పుట్లూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని నవ్య కీర్తన ధర్మవరంలో నిర్వహించిన జిల్లా చెస్ పోటీలలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆస్మ సయోదా, పిఇటి పవన్‌కుమార్, ఉపాధ్యాయులు నవ్య కీర్తనను అభినందించారు.

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మల్లెల లక్ష్మిదేవి

ప్రజాశక్తి-గుత్తి

పురపాలక సంఘం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మల్లెల లక్ష్మీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పనిచేస్తున్న బీవీ.నరసారెడ్డి వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. లక్ష్మీదేవి గతంలో కూడా గుత్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

పబ్లిక్ నోటీసు

ఇందు మూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయడము ఏమనగా నా క్లయింటు అయినటువంటి శ్రీ D.శ్రీనివాసులు S/o నారాయణ, తన ఆస్థికి సంబంధించిన విక్రయ దస్తావేజు నందు No:1977/2003 తన పేరు పొరపాటుగా D.శ్రీనివాసులు S/o నారాయణ, అని వ్రాయుటకు బదులుగా G.శ్రీనివాసులు S/o నారాయణ అని వ్రాసినారు. ప్రస్తుతము నా క్లయింటు సదరి ఆస్థిని M/S.CHOLAMANDALAM Investment and Finance Company Limited (CIFCL) Ananthapuramu వారి వద్ద తనఖ చేసి ఋణం పొందుటకు దరఖాస్తు చేసి యున్నారు. వీరిపై ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో నన్ను గానీ నా క్లయింటును గాని ఈ ప్రకటన వెలువడిన వారం (7) రోజుల లోపు సంప్రదించగలరు.

SCHEDULE

Property Known as per the Regd Sale Deed dated 26.02.2003 U/D.No:1977/2003

Ananthapuramu R.D. and S.R.D. Within Ananthapuramu Municipal area and the property particulars are as follows.
Ward No.4,T.S.No:2157/1, measuring A.C. 1.68 and T.S.2157/2, measuring A.C.1.92.5-out of this-Plot No:73.
Boundaries:
East : Plot No:74, West :15 feet Road, North :Plot No:76, South :Plot No:72
Total Extent :50.00 Sq.yards.

J.ABHILASH, B.A.LLB
Advocate, Ananthapuramu

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అభివృద్ధికి కృషి

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రైతు నేస్తం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కూడేరు మండలం ముద్దాలపురం సమీపంలో ఎఫ్ఇఒలు రైతులకు మద్దతుగా వాల్ మార్ట్ ఫౌండేషన్, ఫ్లిఫ్ కార్ట్, ఇక్రిశాట్ సంస్థల సహకారంతో ఎఎఫ్ ఏకాలజి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎఎఫ్ ఎకాలాజి సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డితో కలిసి విశ్వేశ్వరరెడ్డి బుధవారం సందర్శించారు. రైతులు తయారు చేసిన రెడీ టూ ఈట్ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో రూ.5 కోట్ల వ్యయంతో ముద్దాలపురం వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీనివల్ల ఈ ప్రాంత రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు వారికి ఉపాధి కూడా దొరుకుతుందన్నారు. ఈ యూనిట్ అభివృద్ధికి తనవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇక్కడ తయారయ్యే రెడీ టు మేక్ రెడీ టు ఈట్‌కు సంబంధించిన చిక్కీలు తదితర పదార్థాలను ప్రభుత్వం ద్వారా బడులకు కొనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, సర్పంచి ధనుంజయ, నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, మంజునాథ్ రెడ్డి, కలగళ్ల భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

నేడు రంగం ఆది వెడ్డింగ్ శిల్క్ షోరూం ప్రారంభం

హాజరుకానున్న ప్రముఖులు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక అంబేద్కర్ భవన్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రంగం ఆది వెడ్డింగ్ శిల్క్ షో రూమును ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ అధినేత రంగం ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ అనంత ప్రజల ఆదరణతో నాణ్యమైన చేనేత పట్టు వస్త్రాలను అందించాలని నూతన హంగులతో షోరూంను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే ధర్మవరం ప్రాంతంలో అతిపెద్ద షోరూం ద్వారా వేల మోడల్స్ ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. నాణ్యత, నమ్మకం అంటే రంగం ఆది సిల్క్స్ అన్నట్లుగా ప్రజల ఆదరణ పొందామని తెలిపారు. ప్రజల ఆదరణతో అనంతపురంలో నూతన హంగులతో బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. వేలాది చేనేత మగ్గాలపై మోడల్స్‌ను నాణ్యతతో ప్రజలకు అందిస్తామన్నారు. ముఖ్యంగా వెడ్డింగ్ కలెక్షన్స్ ప్రత్యేకంగా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు అధికారులు, పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలియజేశారు.

నిజాయితీ చాటుకున్న ప్రయాణికురాలు

ప్రజాశక్తి-గుత్తి

బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ఓ ప్రయాణికురాలు హోటల్ వద్ద మరిచిపోయి వెళ్లగా.. దానిని బాధితురాలికి అందజేసి మరో ప్రయాణికురాలు నిజాయితీ చాటుకున్న సంఘటన గుత్తి బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని ఇసురాళ్లపల్లి గ్రామానికి చెందిన అరుణజ్యోతి అనే ప్రయాణికురాలు చెన్నై వెళ్లేందుకు బుధవారం గుత్తి బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండ్ వద్ద ఓ హోటల్లో అల్పాహారం తినింది. ఆమె తల్లిదండ్రులు ఫోన్ చేయడంతో హడావుడిలో తన హ్యాండ్ బ్యాగ్‌ను మర్చిపోయి రైల్వేస్టేషన్‌కు ఆటోలో వెళ్లింది. అనంతరం ఆమె తన హ్యాండ్ బ్యాగు మిస్సయిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హ్యాండ్ బ్యాగ్‌లో 8 తులాల బంగారు నగలు ఉన్నాయని తెలిపింది. సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, సిబ్బంది హోటల్ వద్ద విచారిస్తుండగా మాబున్ని అనే ప్రయాణికురాలు అక్కడికు వచ్చింది. ఆ హ్యాండ్ బ్యాగ్ తనకు లభించిందని చెప్పి దానిని బాధితురాలు అరుణ జ్యోతికి అందజేసి తన నిజాయితీని చాటుకుంది. మాబున్నీని సిఐ వెంకటరామిరెడ్డి అభినందించారు.

ప్రబలుతున్న విష జ్వరాలు

గార్లదిన్నె : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మర్తాడు, కోటంక, కుప్పలకొండ గార్లదిన్నె గ్రామాలలో మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. మురుగునీటిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలు వృద్ధిచెంది విష జ్వరాలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై మురుగునీరు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

టిడిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎలాంటి అభివృద్ధి జరగలేదని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ విమర్శించారు. బుధవారం కసాపురం గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా వైసి ప్రభుత్వం పథకాల పేరిట ఆన్‌లైన్‌లో సొమ్ము జమచేసి దానికి పదింతలు ప్రజల నుండి పన్నులు, ఛార్జీలు పెంచి వసూలు చేస్తోందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి కరెంట్ బిల్లు, ఇంధనం ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, ఆర్టీసీ ఛార్జీలు, మున్సిపాల్టీలో రకరకాల పన్నులు పెంచి, రైతులు మోటార్లకు మీటర్లు బిగించి సబ్సిడీ పేరుతో వారి ఖాతాలో నుంచి నేరుగా నగదు లాక్కునే ప్రయత్నం చేశారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం కొద్ది మందికే లబ్ధి చేకూర్చి వేల మంది రైతులకు మొండి చేయి చూపించారన్నారు. డ్రిప్పు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు సబ్సిడీతో గత ప్రభుత్వం అందిస్తే వీటిలో ఏ ఒక్కటీ కూడా రైతుకు అందకుండా చేశారన్నారు. అధికారంలోకి వస్తే హోదా తెస్తామన్న మాట తప్పి రాజధానిని మూడుముక్కలుగా చేస్తానంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడన్నారు. ఇప్పటికైనా ప్రజలు జగన్మోహన్ రెడ్డి చేస్తున్న మోసాలను గుర్తించి చంద్రబాబు నాయుడుని సమర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పవన్ గౌడ్, మాజీ ఎంపీపీ రాయల్ రామయ్య, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటేశు, టిడిపి నాయకులు కందుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : ఏళ్ల తరబడి రేషన్ కార్డులు ఉండేవి. అనేక కారణాలు చూపి తొలగించారు. వృద్యాప్యంలో ఎలాంటి ఆధారం లేకుండా ఉన్నాం. వచ్చే పింఛన్లు తొలగించారు. పింఛన్ ఇప్పించాలంటూ ఆయా డివిజన్ ప్రజలు, మహిళలు టిడిపి బృంద సభ్యులతో అన్నారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో బుధవారం 34, 35, 36 డివిజన్లలో ఇదేమీ ఖర్మ రాష్ట్రానికి అనే నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను టిడిపి బృందానికి అందజేసి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితో బాధలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, దేవర్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ రెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి స్వప్న, మాజి కార్పొరేటర్ శివబాల, షరీన, క్రిష్ణవేణి, గుర్రం నాగభూషణ, ముక్తియార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న జితేంద్రగౌడ్

పొత్తుల కోసం పాకులాడడం సిగ్గుచేటు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం

ప్రజలకు మంచి చేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు పొత్తుల కోసం పాకులాడడం సిగ్గుచేటని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకునే చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదా? అని ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తమ పొత్తు ప్రజలతోనే ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం 32వ డివిజన్‌లో కార్పొరేటర్ కమల్ భూషణ్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే.. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని చెప్పారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థల పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే, అది చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందే కానీ ప్రజలకు మేలును చేయలేదన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రజలను మోసం చేశాయన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్పొరేటర్లు, వైసిపి అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్లు మండలం కొత్తకోట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్‌తో కలిసి విశ్వేశ్వరరెడ్డి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలు తప్పక గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, మండల అగ్రి అడ్వైజరి చైర్మన్ భీమరెడ్డి, నాయకులు కరణం భీమరెడ్డి, మాజీ జెడ్పిటిసి సింగాడి తిప్పయ్య, భరత్ రెడ్డి, విడపనకల్లు పిఎసిఎస్ చైర్మన్ శ్రీరాములు, ఎంపిటిసి తిమ్మరాజు యాదవ్, ఎంఎల్ఓ కుల్లాయి స్వామి, సుధాకర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'2024 ఎన్నికల్లో శింగనమలకు నేనే ఎమ్మెల్యే'

మాజీ మంత్రి సాకే శైలజానాథ్

పుట్లూరు : 2024లో జరిగే ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం నుండి తానే ఎమ్మెల్యేగా గెలుస్తానని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. బుధవారం పుట్లూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శైలజానాథ్ మాట్లాడారు. గతంలో శింగనమల నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి వచ్చే ఎన్నికల్లో తన గెలుపుకు కృషి అవుతుందని అన్నారు. ఈసారి ఏ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలబడతారని విలేకరులు ప్రశ్నించగా.. కాలమే నిర్ణయిస్తుందని సమాధానం చెప్పారు. గెలిచేది మాత్రం తానేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ డిసిసి ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి, శింగనమల మాజీ ఎంపీటీసీ పూల ప్రసాద్, గార్లదిన్నె హరి, పుట్లూరు లక్ష్మీనారాయణరెడ్డి, విష్ణునారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉరవకొండ : విడపనకల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దారు బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో సమస్యలపై సెప్టెంబర్ 19వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు స్పందించలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. నాడు- నేడు పనుల కోసం పాఠశాల పక్కన పెద్ద గుంతలు తవ్వి పనులను ఆపివేశారన్నారు. పాఠశాల నిర్మాణ పనులు పూర్తి అయినా కాంట్రాక్టర్ స్వలాభం కోసం మిగిలిన పనులను వదిలేసి వెళ్లిపోయారన్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు గుంతల్లో, పాఠశాల మైదానంలో నీరు చేరిందన్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులను, తల్లిదండ్రులను కలుపుకొని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ విడపనకల్ మండల అధ్యక్షుడు శాంత రాజు, నాయకులు లింగేశ్వర్, సురేంద్ర, మహేష్, పురుషోత్తం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికోల సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

వైద్య కళాశాల ప్రిన్సిపల్ మైరెడ్డి నీరజ

అనంతపురం : మెడికోల సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మైరెడ్డి నీరజ అన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ అధ్వర్యంలో జాతీయ సేవా పథకం సెల్ఫ్ ఫైనాన్స్ యూనిట్ సమన్వయంతో కులమతాల ఘర్షణల వల్ల, టెర్రరిస్టులు దాడుల వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలబాలికల సంరక్షణార్థం రూ.2,03,553 విరాళాన్ని సేకరించారు. డబ్బును భారతదేశ రక్షణ శాఖ స్వయం ప్రతిపత్తి సంస్థ నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోనికు అందజేశారు. సమాజానికి తమవంతు సహకారాన్ని అందించే విధంగా ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను మెడికల్ కళాశాల జాతీయ సేవా పథకం తరఫున నిర్వహించబోతున్నామని ప్రిన్సిపల్ నీరజ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా వెయ్యి మందికి పైగా వారికి తోచిన విధంగా డబ్బులను కళాశాల జాతీయ సేవా పథకానికి అందించారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ వేముల సరోజ, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ పునర్జీవన్ కుమార్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ షహజీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలను సీజ్‌చేయాలి

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం పట్టణంలోని ఉమానగర్‌లో అనుమతులు లేకుండా నకిలీ పత్రాలతో నిర్వహిస్తున్న నారాయణ పాఠశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతరాయుడు మాట్లాడుతూ.. అనుమతులేకున్నా నారాయణ పాఠశాలలో 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో దీనిపై ప్రశ్నిస్తే నకిలీ పత్రాలను చూపుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ పట్టణ ఉపాధ్యక్షులు క్రాంతి, అక్షిత్, సిద్ధార్థ, కంబదూరు మండల కార్యదర్శి సాయి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు

రూ.13.33 లక్షల విలువైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-గుంతకల్లు

నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

ఎపి, తెలంగాణా రాష్ట్రాలలో రైళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను కర్నూలు రైల్వే పోలీసులు అరెస్టుచేసి వారు వివిధ ప్రాంతాల్లో చోరీ చేసిన రూ.13.33 లక్షల విలువైన 77 మొబైల్ ఫోన్లు, 5 ల్యాప్‌టాప్‌లు, 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ కె.చౌడేశ్వరి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. హైదరాబాదు కూకట్‌పల్లిలో నివాసముంటున్న నంద్యాల నూనెపల్లికి చెందిన గొల్ల సంతోష్, ప్రకాశం జిల్లా బద్వేలు గ్రామానికి చెందిన బత్తుల రామకృష్ణ ఇద్దరూ ఎపి, తెలంగాణా రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల్లో రైళ్లలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికుల నుండి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ లతోపాటు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడ్డారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కర్నూలు ఐఆర్‌పిఎన్ అశోక్ కుమార్, ఆర్పీ ఎఎస్ఐ జి.సురేష్‌బాబు తమ సిబ్బందితో టీముగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కర్నూలులో ఆ ఇద్దరు నిందితులను అరెస్టు చేశారన్నారు. వారు నంద్యాలలో దాచిన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రైల్వే కోర్టులో హాజరు పరుస్తామని ఎస్పీ చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు. జిఆర్‌పి డిఎస్‌పి అజీజ్ ఖాన్, కర్నూలు ఐఆర్‌పి అశోక్‌కుమార్, ఆర్‌పి ఎస్ఐ సురేష్ బాబు, గుంతకల్లు ఆర్‌పి సిఐ నగేష్‌బాబు, కర్నూలు రైల్వే హెచ్‌సి కోదండ రాముడు, పిసిలు గఫూర్‌బాషా, రాంగోపాల్, రహమత్ బాషా, నరేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె : కణంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కణంపల్లి గ్రామానికి చెందిన కుడమల రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ హోసూరుకు చెందిన భగవంతప్ప ద్విచక్రవాహనంపై అనంతపురం వైపు వస్తూ కణంపల్లి వద్ద కొడమల రామకృష్ణను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108లో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు

గుత్తి : అనారోగ్యంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి వెళుతున్న ఓ వ్యక్తిని గుత్తి పోలీసులు బుధవారం కాపాడారు. పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన కంబిరెడ్డి అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆ బాధను భరించలేక గుత్తి పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న రైల్వే గేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి వెళుతుండగా విధి నిర్వహణలో ఉన్న గేట్‌మెన్ డయల్ 100కి ఫోన్ చేశాడు. అప్రమత్తమైన కానిస్టేబుల్ మారుతి ప్రసాద్, హోంగార్డు రఫీ లు అక్కడికి వెళ్లి అంబిరెడ్డిని రక్షించారు. ప్రాణం చాలా విలువైనదని ఆత్మహత్య చేసుకోరాదని ధైర్యాన్ని ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి అతన్ని అప్పగించారు. ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని కాపాడిన గేట్‌మెన్, కానిస్టేబులు, హోంగార్డును పలువురు అభినందించారు.

మోటార్ల కేబుల్ వైర్ చోరీ

పుట్లూరు : పుట్లూరు మండలం మడ్డిపల్లి గ్రామంలో 11 మంది రైతుల వ్యవసాయ తోటల్లోని మోటర్ల కేబుల్ వైరును దుండగులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. మడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్ రెడ్డికి చెందిన ఏడు మోటర్లకు సంబంధించిన కేబుల్ వైరు, ఇతర నాలుగురు రైతులకు చెందిన మోటర్ల కేబుల్ వైరును చోరీ చేశారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా కడవకల్లు, దోసలేడు, ఓబులాపురం, మడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ మోటర్ల కేబుల్ వైర్లను చోరీ చేశారు. వరుస సంఘటనలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. దుండగులను గుర్తించి కేబుల్ వైరు రికవరీ చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అర్బన్ బిసిసెల్ అధ్యక్షులుగా పోలన్న

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులుగా దళవాయి సిమెంట్ పోలన్నను నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పోలన్న మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

వైభవంగా దర్గా హొన్నూరు ఉరుసు

బొమ్మనహాల్ : దర్గా హొన్నూరు గ్రామంలో ఆరు రోజులుగా నిర్వహించిన శర్మాస్‌వలి ఉరుసు మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. దర్గా ముతవల్లి కమల్‌బాషా రహంతుల్లా మాట్లాడుతూ.. స్వామివారి ఉరుసు శంషేర్ గుర్రం సవారి ఉన్నల్లి గ్రామంలో ప్రారంభమై దర్గా హొన్నూరుకు చేరిందని చెప్పారు. శంషేర్ ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయదుర్గం సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం

పుట్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లతో జాబ్ కార్డులు అప్డేట్ చేసుకోవడం, వర్క్ ఫైళ్ల తయారు చేసుకోవడం, ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీల వివరాలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో పంపడం, చేసిన పనులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయడం తదితర వాటిపై చర్చించారు. ఏపీవో చెన్నకేశవులు, ఈసీ విజయనాగేంద్రరెడ్డి, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

ఆదర్శ రైతుకు సన్మానం

ఉరవకొండ : మిరప పంట సాగులో సేంద్రియ ఎరువులను వాడి సాగుచేసిన ఆదర్శ రైతు గోపాల్‌రెడ్డిని జై కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ మండలంలోని నెరమెట్ల గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి తనకున్న రెండు ఎకరాల్లో సేంద్రియ ఎరువులతో మిరప పంట సాగుచేస్తూ అబ్బుర పరుస్తున్నారని తెలిపారు. కేవలం రూ.13 వేలు పెట్టుబడి పెట్టి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. బుధవారం రైతు గోపాల్‌రెడ్డి సాగు చేసిన మిరప పంటను పరిశీలించి సాగు విధానాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయనను పొలంలోనే సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, దాదావలి, రమేష్ పాల్గొన్నారు.

జెసి కేతన్‌గార్గ్‌ను కలిసిన వడ్డెర సంఘం నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : యాడికి గ్రామంలో వడ్డెర్లకు కమ్యూనిటీ ఫంక్షన్ హాల్ నిర్మించడానికి నిధులు మంజూరుచేయాలని మాజీ వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ దేవర్లమురళి డిమాండ్ చేశారు. బుధవారం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో యాడికి గ్రామంలోని వడ్డెర్లకు 454 -ఏ లో 3-14 ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. అందులో కొంత స్థలం శ్మశానవాటికగా, మరికొంత నివాస స్థలంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. కొంత స్థలం ఉందని వాటిలో కమ్యూనిటీ ఫంక్షన్ హాలు నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు.